క్లుప్తంగా

మేళ్ల చెరువు పరిసరాలు శుభ్రం



చెరువు పరిసరాలను శుభ్రం చేస్తున్న గ్రీన్‌ఆర్మీ సభ్యులు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్‌లోని మేళ్ల చెరువు పరిసరాలను తెల్లాపూర్ నైబర్‌హుడ్ గ్రీన్ ఆర్మీ ఆధ్వర్యంలో శనివారం శుభ్రం చేశారు. ఈ సందర్భంగా తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వరగారి రమణ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం తమ వంతుగా కృషి చేస్తున్నామన్నారు. అందులో భాగంగానే గ్రీన్‌ఆర్మీను ఏర్పాటు చేసి అందరం కలిసికట్టుగా చెరువుల పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగిస్తున్నామని తెలిపారు. ప్రతి ఆదివారం ఒక చెరువును ఎంపిక చేసుకొని పరిసరాలను శుభ్రం చేస్తున్నట్లు వివరించారు.

నీట్ పరీక్ష నిర్వహణపై విచారణ జరిపించాలి

నారాయణఖేడ్: దేశవ్యాప్తంగా ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ప్రవేశానికి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన నీట్ పరీక్ష ఫలితాలపై అనేక అనుమానాలకు తావిస్తున్న నేపథ్యంలో పరీక్ష నిర్వహించిన తీరుపై కేంద్ర ప్రభుత్వం సమగ్ర విచారణ జరిపించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ దత్తురెడ్డి శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇటీవల నిర్వహించిన నీట్ ప్రకటించిన ఫలితాల్లో అనేక అవకతవకలు జరిగాయని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేస్తున్నారన్నారు. వారి అనుమానాలకు సాక్ష్యంగా ఆరుగురు విద్యార్థులకు 720 మార్కులకు 720 మార్కులు రావడం, వారి పరీక్షా కేంద్రం ఒకటే కావ డంతో వారి అనుమానాలకు బలం ఇస్తోంద న్నారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం స్పందించి నీట్ పరీక్షా ఫలితాలపై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జి చేత విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

ఖాజీపల్లి గ్రామంలో చోరీ

జిన్నారం(పటాన్‌చెరు): మండల పరిధిలోని ఖాజీపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి దొంగలు చోరీకి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాధితుడు మోహన్‌రెడ్డి ఖాజీపల్లిలోని 181 సర్వే నంబర్‌లోని కాలనీలో నివాసం ఉంటున్నాడు. ఈ క్రమంలో మోహన్‌రెడ్డి గురువారం సొంత గ్రామమైన కామారెడ్డికి వెళ్లగా ఆయన భార్య పక్కనే ఉన్న బంధుల ఇంట్లో నిద్రించింది. శనివారం ఉదయం ఇంటికి వెళ్లి చూడగా వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. రూ.80వేల నగదు, ఇతర వస్తువులు చోరీకి గురైనట్లు బాధితులు బోరున విలపించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

స్టాంప్ వెండర్లపై చర్యలు తీసుకోవాలి

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని స్టాంప్ వెండర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని బీజేపీ ఓబీసీ రాష్ట్ర మోర్చా కార్యదర్శి సుధీర్ బండారీ శనివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. భూమి కొనుగోలు ఒప్పదం పత్రం పొందడానికి విద్యార్థుల ఉపకార వేతనాలు, హామీ పత్రాలు తదితర వాటికి స్టాంపు పేపర్ల అవసరం ఉంటుందన్నారు. అయితే కొంత మంది స్టాంప్ వెండర్లు అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం స్టాంప్ పేపర్‌కు రూ.20 వసూలు చేయాలి. కానీ రూ.50 వసూలు చేస్తున్నారని, ఇదేంటని ప్రశ్నిస్తే కొరత ఉందంటూ సమాధానం చెబుతున్నారని వాపోయారు. సబ్‌రిజిస్ట్రార్ వెంటనే స్పందించి స్టాంప్ వెండర్ల లైసెన్స్‌లు రద్దు చేయాలని కోరారు.

ఘనంగా భవానీమాత ఆలయ వార్షికోత్సవం



భవానీమాత ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

కల్హేర్(నారాయణఖేడ్): కల్హేర్ పోమ్యానాయక్ తండాలో భవానీమాత ఆలయ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు బోనాలతో ఊరేగింపు నిర్వహించారు. టీపీసీసీ సభ్యుడు కర్నె శ్రీనివాస్ భవానీమాతకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ నిర్వాహకులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ సయ్యద్ ఫహీం, కాంగ్రెస్ నాయకులు దేవదాస్, లతీఫ్, సత్యగౌడ్, బాల్‌రెడ్డి, బాగవాన్ చాంద్, శివకుమార్, రాఘవేందర్, శంకర్, పండరి, గోవింద్ పాల్గొన్నారు.

మొక్కజొన్న సాగుకు ఇదే అదను

మొక్కజొన్న మంచి ఆదాయం ఇచ్చే వాణిజ్య పంటగా రైతుల ఆదరణ పొందుతోంది. తక్కువ పంట కాలంతో పాటు ఎక్కువ దిగుబడి వస్తుండడంతో అన్నదాతలు ఈ పంటపై మొగ్గు చూపుతున్నారు. వాణిజ్య పంట అయినందునా మార్కెట్లో మంచి డిమాండ్ ఉంది. ఆహారంగానే కాకుండా గింజలను పశువులకు మేత, కోళ్లకు దాణా తయారీలో వినియోగించడంతో మంచి డిమాండ్ ఉంది. దీంతో మొక్కజొన్న సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. అనువైన రకాలు ఎంచుకోవడం, సకాలంలో నీటి తడులు, సక్రమంగా సస్యరక్షణ, తగిన మోతాదులో ఎరువుల వినియోగం, దిగుబడులకు తీసుకోవాల్సిన సాగు పద్ధతులపై జహీరాబాద్ ఏడీఏ భిక్షపతి వివరించారు.

– జహీరాబాద్ టౌన్

- సస్యరక్షణతో అధిక దిగుబడులు
- మేలైన విత్తన రకాలను ఎంచుకోవడం ఉత్తమం
- మొక్కజొన్న పంటలో అంతరపంటలకు అవకాశం
- సాగు పద్ధతులపై ఏడీఏ భిక్షపతి రైతులకు సూచన



జహీరాబాద్‌లో సాగవుతున్న మొక్కజొన్న పంట

నేలల ఎంపిక



భిక్షపతి, ఏడీఏ, జహీరాబాద్

మొక్కజొన్న సాగుకు నీరు నిలువని సారవంతమైన తేలిక, మధ్య రకం నేలలను ఎంపిక చేసుకోవాలి. బలమైన ఎర్ర, గరపు నేలలైతే అనుకూలం .నీరు నిల్వ ఉండే భూములు మొక్కజొన్న సాగుకు అనుకూలం కావు.

అనువైన రకాలు

అధిక దిగుబడులు ఇచ్చే విత్తన రకాలను ఎంపిక చేసుకోవాలి. డీహెచ్ఎం–117 రకం పంట కాలం 90–100 రోజులు, ఎకరానికి 30–35 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. డీహెచ్ఎం–105 రకం పంట కాలం 105–120 రోజుల్లో ఎకరానికి అత్యధికంగా 25–30 క్వింటాళ్ల దిగుబడి వచ్చే అవకాశం ఉంది. మధ్య స్వల్పకాలికి సంకర జాతి డీహెచ్ఎం–107 రకం పంట కాలం 88–95 రోజుల్లో ఎకరానికి 22–25 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. డీహెచ్ఎం –109 రకం కాలం 85–90 రోజులు. ఎకరానికి 22–25 క్వింటాళ్లు వస్తుంది. 105–120 రోజుల్లో దిగుబడి వచ్చే త్రిశూలత ఎకరానికి 25–30 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. స్వల్ప కాల పంటలైన మాధురి(తిపి రకం)75– 80 రోజుల్లో పంట రాగా ఎకరాకు 8 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. ఇవే కాకుండా అనేక ప్రైవేట్ కంపెనీలు రకరకాల విత్తనాలను మార్కెట్‌లోకి అందుబాటులోకి తీసుకువచ్చాయి.

విత్తటంలో మెలకువలు

జూన్ 15 నుంచి జులై 15 వరకు ఖరీఫ్‌లో వర్షాధారంగా మొక్కజొన్న సాగు చేసుకోవచ్చు. ఎకరానికి ఏడు కిలోల విత్తనాలు సరిపోతాయి. వరుస వరుసకు మధ్య 25 అంగుళాలు, వరుస మొక్కల మధ్య 10 అంగుళాలు ఎడం ఉండేలా విత్తుకోవాలి. కిలో విత్తనాలకు 2 గ్రాముల కార్బండజిమ్ పొడి మందును పట్టించి విత్తుకుంటే తొలిదశలో తెగుళ్లకు పంట తట్టుకుంటుంది.

ఎరువుల వాడకం

వర్షాకాలంలో విత్తేటప్పుడు 25 కిలోల యూరియా, 125 కిలోల సింగిల్ సూపర్ పాస్ఫేట్, 25 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేసుకోవాలి. విత్తిన 30–40 రోజులకు ఎకరాకు 50 కిలోల యూరియా వేయాలి. అధిక దిగుబడి వంగడాలను సాగు చేసుకున్నట్లయితే సిఫార్సు చేసిన ఎరువుల కంటే 25 నుంచి 30 శాతం అధికంగా వినియోగించుకోవాలి.

కలుపు నివారణ

కరాకు కిలో అట్రజిన్ 50 శాతం పొడి మందును 200 లీటర్ల నీటిలో కలిపి గాని లీటరు నీటికి 5 మిల్లీ లీటర్ల చొప్పున పెండిమిథాలిన్ 30 శాతాన్ని కలిపి నేలపై పిచికారి చేయాలి. సంకరజాతి విత్తనాల్లో రోగ నిరోధక శక్తి తక్కువగా ఉంటుంది. కంకులు పోసుకునే దశలో పచ్చపురుగు ఆశించి కంకిని నాశనం చేస్తాయి. దీంతో క్లోరిపైరిఫాస్ 2.5 మిల్లీలీటర్లు నీటిలో కలిపి పిచికారి చేయాలి. మొక్కజొన్నలో అంతర పంటలు వేసుకుంటే మేలుగా ఉంటుంది. వర్షం నీరు బయటకు వెళ్లేందుకు వీలుగా కాలువలు ఏర్పాటు చేసుకోవాలి.

విద్యతోనే దేశాభివృద్ధి సాధ్యం



బడిబాట ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

- బడీడు పిల్లలను పనికి పంపించొద్దు
- ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి

నారాయణఖేడ్: విద్యతోనే దేశ అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి అన్నారు. నాగల్‌గిద్ద మండల పరిధిలోని దామర్‌గిద్ద గ్రామంలో బడిబాట కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలందరినీ తప్పకుండా చదివించాలన్నారు. బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సూచించారు. అనంతరం మనూరు మండలంలోని డోవూరు తండాలోని ప్రాథమిక పాఠశాలలో చేపట్టిన మరమ్మతు పనులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ జయశ్రీ మోహన్‌రెడ్డి, నాయకులు దిగంబర్‌రెడ్డి, సంగన్న, గుండెరావు పాటిల్, రాంచందర్ రెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, రాజు, సంజీవ్‌రెడ్డి, పాష పాల్గొన్నారు.

ఆలయాల వార్షికోత్సవాలకు హాజరు

నారాయణఖేడ్ మండల పరిధిలోని చల్లగిద్ద తండాలో త్రయాహ్నిక జగదాంబ మాత, సేవాలాల్ మహారాజ్, రాంరావు మహారాజ్ ఆలయాల ప్రథమ వార్షికోత్సవాలు 3 రోజులుగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి శనివారం ఉత్సవాలకు హాజరై మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం పూజారులు ఎమ్మెల్యేను సన్మానించారు. ఖేడ్ ఎంపీపీ చాందీబాయి, తండాకు చెందిన తహసీల్దారు రాణాప్రతాప్‌సింగ్, బంజారా సేవాలాల్ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్‌చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

పరిహారం చెక్కుల పంపిణీ

బీబీపేటకు చెందిన జనార్దన్‌రెడ్డి, తుక్యానాయక్ తండాకు చెందిన జమిలీబాయికి చెందిన గేదె ఇటీవల విద్యుదాఘాతంతో మృతి చెందగా విద్యుత్ శాఖ ద్వారా పరిహారం మంజూరైంది. అందుకు సంబంధించిన చెక్కులను ఎమ్మెల్యే సంజీవరెడ్డి ఆయన నివాసంలో అందజేశారు. నాయకులు భండారి సాయిలు, శివారెడ్డి, టిక్యానాయక్, రాంచందర్ పాల్గొన్నారు.

చేప మందు పంపిణీ

నారాయణఖేడ్: మృగశిర కార్తెను పురస్కరించుకొని నిజాంపేట్ మండల కేంద్రంలో ఉబ్బసం వ్యాధిగ్రస్తులకు శనివారం తడకంటి కుటుంబీకులు ఉచితంగా చేప మందు పంపిణీ చేశారు. తడకంటి వంశీయులు దగ్గు, దమ్ము, ఉబ్బసం, అస్తమా వ్యాధిగ్రస్తులకు 82 ఏళ్లుగా చేపప్రసాదాన్ని పంపిణీ చేస్తూ వస్తున్నారు. ఏటా ప్రసాదం కోసం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు పొరుగున ఉన్న కర్ణాటక, మహారాష్ట్రాలనుంచి వ్యాధిగ్రస్తులు వస్తుంటారు. కార్యక్రమంలో నిర్వాహకులు తడకంటి పర్వాగౌడ్, లింగాగౌడ్, శంకర్‌గౌడ్, నాగరాజ్‌గౌడ్, సాయిబాబాగౌడ్, వెంకటేష్‌గౌడ్, కల్లుగీత కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అంజాగౌడ్ పాల్గొన్నారు.



చేప మందు వేస్తున్న ఆడెం మనోహర్

నిజాంపూర్‌లో...

సదాశివపేట రూరల్ (సంగారెడ్డి): మండల పరిధిలోని నిజాంపూర్ గ్రామంలో గ్రామానికి చెందిన ఆడెం మనోహర్ సోదరులు శనివారం చేప మందు ప్రసాదాన్ని ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దగ్గు, దమ్ము, ఎలర్జీ, ఉబ్బసం బాధితులు అధికసంఖ్యలో తరలివచ్చి చేప మందు ప్రసాదాన్ని తీసుకున్నారు. 45 ఏళ్లగా ఉచితంగా చేప మందును పంపిణీ చేస్తున్నారు. సేవలకు గుర్తింపుగా ఆడేం మనోహర్‌కు ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ను ఆ సంస్థ తెలంగాణ కోఆర్డినేటర్ మడుపు రాంప్రకాష్ అందజేశారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు తదితరులు పాల్గొన్నారు.



చేప ప్రసాదం వేస్తున్న తడకంటి కుటుంబీకులు

పోలీసులకు మత్స్యకారుల ఫిర్యాదు

పుల్‌కల్(అందోల్): చెరువులోని చేపలను గ్రామస్తులు పట్టుకోవడంతో మత్స్యకారుల సంఘం సభ్యులు శనివారం ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని మిన్‌పూర్ గ్రామంలో మృగశిర కార్తె సందర్భంగా మత్స్యకారుల ఆధీనంలో ఉన్న చెరువులో గ్రామస్తులు గుట్టుచప్పుడు కాకుండా చేపలు పట్టారు. దీంతో మత్స్యకారుల ఫిర్యాదుపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పాఠశాల పనుల పరిశీలన

మునిపల్లి(అందోల్): మండల పరిధిలోని బుదేరా అమ్మ అదర్శ పాఠశాలలో నిర్వహిస్తున్న అభివృద్ధి పనులను ఎంఈఓ ధశరథ్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ వరకు పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమాన విధించింది. పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ సీఐ శ్రావణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గురు, శుక్రవారాల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 17 మందిని అదుపులోకి తీసుకొని శనివారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చారు. దీంతో జడ్జి ఒక్కొక్కరికి రూ.1000 చొప్పున జరిమానా విధించినట్లు పేర్కొన్నారు.

వృద్ధురాలిని కాపాడిన పోలీసులు

పటాన్‌చెరు టౌన్: చెరువులో పడిన వృద్ధురాలని స్థానికుడి సాయంతో ఎస్ఐ కాపాడారు. ఈ సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ ఆసిఫ్ అలీ కథనం ప్రకారం.. పటాన్‌చెరు మండలం ముత్తంగి గ్రామానికి చెందిన కమలమ్మ(60) అనే వృద్ధురాలు కాలకృత్యాల కోసం గ్రామంలోని చెరువు వద్దకు వెళ్లింది. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు చెరువులో పడింది. స్థానికంగా ఓ మహిళ ద్వారా సమాచారం తెలుసుకున్న హైవే పెట్రోలింగ్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ముత్తంగి గ్రామానికి చెందిన కుమార్ చెరువులో దిగి వృద్ధురాలిని బయటకు తీశాడు. పోలీసులు వృద్ధురాలికి సీపీఆర్ నిర్వహించారు. అనంతరం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వృద్ధురాలని కాపాడేందుకు వెళ్లిన పోలీసుల్లో హెడ్ కానిస్టేబుల్‌లు ఇస్మాయిల్, నర్సింహులు ఉన్నారు.

స్కూటీ అపహరణ

జిన్నారం(పటాన్‌చెరు): పార్క్ చేసిన స్కూటీని గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లిన ఘటన మండలంలోని గడ్డపోతారం పారిశ్రామిక వాడలోని న్యూలాండ్ పరిశ్రమ ఆవరణలో శనివారం చోటు చేసుకుంది. బైక్‌ను తీసుకెళ్తున్నట్లు ఉండే దృశ్యాలు సీసీ కెమెరాలో నమోదయ్యాయి. స్కూటీ చోరీ అయిన విషయాన్ని యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫొటోలో ఉన్న వ్యక్తిని గుర్తుపడితే తమకు గాని, పోలీసులకు గాని తెలియజేయాలని పరిశ్రమ ప్రతినిధి శ్రీధర్‌నాయుడు కోరారు.

రాజీమార్గమే మేలైన మార్గం



నారాయణఖేడ్‌లో లోక్‌అదాలత్ నిర్వహిస్తున్న న్యాయవాదులు



జోగిపేటలో కేసులను పరిష్కరిస్తున్న జూనియర్ సివిల్ జడ్జి శాలిని

- జోగిపేట కోర్టు జూనియర్ సివిల్ జడ్జి శాలిని

జోగిపేట(అందోల్): కేసుల్లో ఉన్నవారు రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకోవడమే మంచిదని, దీని ద్వారా సమయం కూడా వృథా కాదు అని జోగిపేట కోర్టు జూనియర్ సివిల్ జడ్జి శాలిని అన్నారు. జోగిపేట కోర్టులో శనివారం నేషనల్ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిఒక్కరూ న్యాయ చట్టాలను గౌరవించాలని సూచించారు. లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రతికారాలకు పోకుండా రాజీ కుదుర్చుకోవడమే మంచిదన్నారు. ఎలాంటి ఖర్చు లేకుండా కక్షిదారులకు న్యాయసేవలు అందించాలన్న లక్ష్యంతోనే లోక్‌అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేవలం రాజీ కుదుర్చుకునేందుకు వీలున్న కేసులను మాత్రమే రాజీ కుదురుస్తామని పేర్కొన్నారు. జోగిపేటలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో 96 కేసులు పరిష్కరించినట్లు తెలిపారు. ఏపీపీ స్వాతిగౌడ్, సీనియర్ న్యాయవాదులు నారాయణరెడ్డి, పీజే విఠల్‌రెడ్డి, న్యాయవాదులు మల్లేశం , నర్సింహులు, కృష్ణ, సిద్దన్న, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

వ్యయ ప్రయాసాలకు గురికావొద్దు

నారాయణఖేడ్: చిన్నచిన్న గొడవలు, ఘర్షణలతో కేసులు పెట్టుకుని పోలీసుస్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరుగుతూ వ్యయ ప్రయాసాలకు గురికావద్దని ఖేడ్ జూనియర్ సివిల్ జడ్జీ కోర్టు న్యాయమూర్తి శ్రీధర్ మంథాని అన్నారు. శనివారం కోర్టులో జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లోక్‌అదాలత్ ద్వారా పరిష్కరించుకోదగిన కేసుల్లో కక్షిదారుల పరస్పర అంగీకారంతో రాజీమార్గంలో పరిష్కరించుకోవాలని సూచించారు. కక్షిదారులు పరస్పర అంగీకారంతో 473 కేసులను పరిష్కరించినట్లు తెలిపారు. స్థానిక బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నర్సారెడ్డి, సీనియర్ న్యాయవాదులు భోజిరెడ్డి, లక్ష్మణరావు, నర్సింహారావు, సంగమేశ్వర్‌రెడ్డి, సుధాకర్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.



జహీరాబాద్ టౌన్‌లో...

లోక్ అదాలత్‌లో 68 కేసులు పరిష్కారం

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని కోర్టు ఆవరణలో మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 68 కేసులు పరిష్కారమైనట్లు సీనియర్ సివిల్ జడ్జి సూరికృష్ణ తెలిపారు. సీనియర్ కోర్టు విభాగంలో 29 బ్యాంక్ పీఎల్సీ, 10 సైబర్ క్రైమ్ కేసులు పరిష్కారం కాగా ఆయా కేసుల నుంచి రూ.37,84,134 వసూలు అయ్యాయన్నారు. జూనియర్ కోర్టు విభాగంలో క్రిమినల్ కాంఫౌండ్ కేసులు 8, సెకండ్ క్లాస్ కేసు ఒకటి, 5 అడ్మిన్ కేసులు, 14 ఎక్సైజ్ కేసులు, ఒక సివిల్ కేసును పరిష్కరించినట్లు పేర్కొన్నారు. లోక్ అదాలత్‌లో సీనియర్ సివిల్ జడ్జి అనూష, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

కొండాపూర్(సంగారెడ్డి): ఉపాధిహామీ చట్టాన్ని పరిరక్షించాలని కోరుతూ హైదరాబాద్‌లో ఈ నెల 10న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహులు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని కోనాపూర్‌లో సదస్సుకు సంబంధించిన కరపత్రాలను శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ కార్మిక సంఘాల పోరాట ఫలితంగా పార్లమెంట్‌లో యూపీఏ–1 ప్రభుత్వానికి వామపక్షాల మద్దతు ఇవ్వడం ద్వారా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం 100 రోజుల పని దినాలను గ్యారంటీ చేస్తూ చట్టం చేసినట్లు గుర్తు చేశారు. ఉపాధి కూలీలకు రోజుకు రూ.600 కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశంలో టెంట్లు, మెడికల్ కిట్లు, తాగునీరు సౌకర్యాలను కల్పించాలన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నుతోందని ఆరోపించారు. సదస్సుకు ముఖ్య అతిథులుగా గ్రామీణ అభివృద్ధి పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, ఎంపీ శివదాసన్, అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి వెంకట్, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు నాగయ్య, వెంకటరాములు హాజరవుతారని తెలిపారు. ఉపాధికూలీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు ఈజీఎస్ సిబ్బంది మేట్లు అధికసంఖ్యలో హాజరు కావాలని సూచించారు.



కరపత్రాలను విడుదల చేస్తున్న ఉపాధి కూలీలు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

ఆటోల్లో సేఫ్‌గా ప్రయాణించండి



మై ఆటో సేఫ్ కార్యక్రమంలో పాల్గొన్న పోలీసు సిబ్బంది



మాట్లాడుతున్న ఎస్ఐ అంజనేయులు

- సీఐ గంగాధర్

జిన్నారం(పటాన్‌చెరు): పోలీస్ స్టిక్కర్లు ఉన్న ఆటోల్లోనే ప్రజలు సేఫ్‌గా ప్రయాణించాలని బొల్లారం సీఐ గంగాధర్ అన్నారు. మండల పరిధిలోని బొల్లారం, గడ్డపోతారం గ్రామాల్లో మై ఆటో సేఫ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటోలకు స్టిక్కర్లు వేశారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జిన్నారం మండల కేంద్రంలో..

ఎస్ఐ విజయారావు ఆధ్వర్యంలో మైఆటో సేఫ్ కార్యక్రమాన్ని జిన్నారం మండల కేంద్రంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటోలకు పోలీసులు స్టిక్కర్లను అతికించారు. కార్యక్రమంలో ఆటోడ్రైవర్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఆటోలకు స్టిక్కర్లు తప్పనిసరి అతికించాలి

పటాన్‌చెరు: ఆటోలకు 'మై ఆటో ఇస్ సేఫ్' స్టిక్కర్లు తప్పనిసరిగా అతికించాలని ట్రాఫిక్ ఎస్ఐ ఆంజనేయులు అన్నారు. పటాన్‌చెరు పట్టణంలోని బస్టాండ్ సమీపంలో ఆటోడ్రైవర్లతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మై ఆటో ఇస్ సేఫ్' స్టిక్కర్ల ద్వారా ప్రయాణికులకు ఆటో ప్రయాణంపై నమ్మకం కలగడంతో పాటు అపత్కాల సమయంలో పోలీసుల సహాయం త్వరగా అందుతుందన్నారు. కార్యక్రమంలో పటాన్‌చెరు ట్రాఫిక్ పోలీసులు, ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు.

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి



కాలనీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ పుష్ప

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలో డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ పుష్ప అన్నారు. డివిజన్‌పరిధిలోని 6, 7బ్లాక్‌లలో శనివారం పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు బస్తీలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని, విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి వీధిదీపాలను ఏర్పాటు చేయాలని కార్పొరేటర్‌ను కోరగా పై సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీనిచ్చారు. ఆమె వెంట స్థానిక నాయకులు, కాలనీవాసులు ఉన్నారు.